# నాకు నచ్చిన నా కథ



యనమండ్ర హైమవతి

ఏ మనిషైనా తను బతుకుతున్న పరిస్థితుల్ని బట్టి ప్రవర్తిస్తాడు. ఏ మనిషి మనస్తత్వమైనా తను ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా రూపుదిద్దుకుంటుంది— ఇవి నా నమ్మకాలు.

రోగిష్టి మనిషి తన ఆరోగ్యానికి సరిపడని ఆవకాయ తినాలనుకోడం సహజం.... కాని అందరితో ఆవకాయ తిన్నట్టు చెప్పి తృప్తిపొందడం అసహజంగా కనిపించినా.... మనస్తత్వం.

నేటి మన సమాజంలో ఆడపిల్లకు పెళ్ళి అవడానికి ఎన్నో అడ్డంకులు.... డబ్బు, చదువు, సౌందర్యం, కులాల పట్టింపులు.... ఎన్నో.... ఎన్నో.... మనిషికి పెళ్ళి బయొలాజికల్ నీడ్ మాత్రమే కాదు— సాంఘిక అవసరంగా కూడా తయారయ్యింది....

పెళ్ళి సమస్యలో చిక్కుకున్న ఓ అమ్మాయి విచిత్ర మనస్తత్వాన్ని 'ఆమె' కథలో చిత్రించ ప్రయత్నించాను. 1981లో 'వనిత'లో వచ్చిన 'ఆమె' కథంటే నా కిష్టం. ఇందులో 'అరుణ'పట్ల నాకు దయ, సానుభూతి.

ఈ కథను మీరూ ఇష్టపడతారని నా నమ్మకం— ఇక చదవండి....

# ఆమె

ప్రియమైన శ్రీమతి అరుణగార్కి—

నమస్సులు.

మీ నుంచి ఉత్తరం వచ్చి చాలా రోజులైంది. ఏమిటి బొత్తిగా రాయడం మానేశారు? ఆఫీసు బిజీయా? కథల బిజీయా?

నేను బాగానే ఉన్నాను— శారీరకంగా. మానసికంగా బాగాలేను. ఓ సమస్య నన్ను వేధిస్తోంది. పరిష్కారం సూచించమని ఆప్తులైన మీకు రాద్దామనుకుంటున్నాను.

ఈ ఉత్తరానికి మీ జాబు వచ్చేక నా సమస్య రాస్తాను.

'కాలంతో పందెం కాసాను.

రాని నీ ఉత్తరం కోసం

బొట్టు బొట్టుగా రక్తం కారుస్తూ

జాబు రాసి అమృతం చిలికించు

నా మది గది లోపల—'

వెంటనే జాబు రాయండి! ప్లీజ్....

మీ

దమయంతి

దమయంతి ఉత్తరం చూసి ఇన్నాళ్ళు ఆమెకు రాయకుండా జాప్యం చేసినందుకు బాధపడ్డాను.

వెంటనే రాసి పోస్టుచేసాను.

*　　　*　　　*

నే రాసిన కథ ఏదైనా పత్రికలో వస్తే కొందరు పాఠకులు ఉత్తరాలు రాస్తూంటారు.

ఈ ఉత్తర రచయిత(త్రు)ల్లో రకరకాల మనుషులుంటారు. కొందరు కథ బాగుందని పొగుడుతారు. కొందరు బాగా లేదంటారు. కొందరు ఆ కథల్లోని పాత్రల్లాంటి మనుషులు తమకు తెలుసనో, అట్లాంటి సంఘటన నిజంగా జరిగిందనో రాస్తారు.

మరికొందరు నాతో స్నేహం చెయ్యాలని వుందని రాస్తారు. ఇంకొందరు వెకిలిగా రాస్తారు.

ఈ రొటీన్ ఉత్తరాలు అలవాటయిపోయి చదివి వదిలేస్తుంటాను. ఓ మాసపత్రికలో నా కథ తనకు నచ్చలేదంటూ సహేతుకంగా ఉత్తరం రాసింది దమయంతి. ఆమె విమర్శ నాకు నచ్చింది. ఆ ఉత్తరాన్నిబట్టి ఆమెకు సాహిత్యంలో మంచి టేస్టు వున్నట్టు అర్థమైంది.

అలా జరిగిన మా పరిచయం స్నేహంగా మారింది. ఒకర్నొకరు చూసుకోకపోయినా, కల్సుకోకపోయినా— ఒకరి సమస్యలు ఒకరికి చెప్పుకునేంత చనువు ఏర్పడింది మా మధ్య.

ఆమెలో మరీ నాకు నచ్చిన విషయం— ఆమె కవితలు రాయడం. ఆమె ప్రతి ఉత్తరంలోనూ ఒక చిన్న కవితేనా రాస్తుంది. అవన్నీ చాలా భావయుక్తంగా ఉంటాయ్....

దమయంతి వాళ్ళది చిన్న పల్లెటూరు. ఆమె తండ్రి అక్కడ ఆయుర్వేద వైద్యం చేస్తారు. ఆమె ఇంటర్ వరకు చదువుకుంది. ఆమె కింకా పెళ్ళి కాలేదు. ఇరవై అరేళ్ళు నిండిన కూతుర్ని పెళ్ళి చెయ్యకుండా ఇంట్లో పెట్టుకున్నందుకు ఆమె తండ్రి చాలా బాధపడుతున్నారని, సంబంధాలు చూస్తున్నారని, ఏవీ కుదరటంలేదని ఓసారామె నాకు రాసింది.

ఆమె రాసే కవితల్లో ఉత్తరాల్లో ఏదో మూల విషాదం వినపడీ, వినబడనట్టు వుంటుంది. దానికి కారణం ఆమెకు పెళ్ళి కుదరకపోవడమేనని నేను అర్థంచేసుకున్నాను.

ఆమెకు ధైర్యం చెబుతూ ఉత్తరాలు రాశాను.

* * *

తన సమస్యేమిటో తెలియజెప్పకుండా నే రాసిన ఉత్తరానికి నాల్గు రోజుల్లోనే జవాబు వచ్చింది.

"మీ ఉత్తరం అందింది. నా సమస్యేమిటో తెలియజేస్తే పరిష్కారం సూచిస్తానన్నారు. మీకు శ్రమ ఇస్తున్నందుకు క్షంతవ్యురాల్ని.

సుమారు రెండు నెలల క్రితం ఆనందరావనే బి.యిడి. టీచర్ మా వూరికి ట్రాన్సఫర్ మీదొచ్చారు. ఆయన మా ఇంటి కెదురుగా కరణంగారింట్లో అద్దెకుంటున్నారు. ఆయన బాగుంటారు. నిండుగా, గంభీరంగా వుంటారు.

ఆయన ఇక్కడికి వచ్చిన కొద్ది రోజులకే మాకు పరిచయం ఏర్పడింది. ఆయన కింకా పెళ్ళి కాలేదు. నాలాగే సాహిత్యాభిలాష ఎక్కువ. నా కవితలు చదివి ఎంతో మెచ్చుకున్నారు. ఆయన ప్రోత్సాహంతోనే నే నీ మధ్య ఇరవై కవితలు రాశాను.

రానురాను మా ఇద్దరికీ చనువు ఏర్పడింది. తర్వాత అది రేకుతొడిగి ప్రేమ పుష్పమైంది. ప్రస్తుతం మేం ఒకర్నొకరు చూడలేకుండా ఉండలేక పోతున్నాం. మా మధ్య ఉన్నది ఆకర్షణ కాదని, ప్రేమ అని నాకు ఖచ్చితంగా తెలుసు. ఒకర్నొకరు బాగా అర్థంచేసుకున్నాం.

ఇద్దరి ఇష్టాలు, ఆలోచనలు, సరదాలు ఒక్కటే. ఆయనకు నా కుటుంబ పరిస్థితులన్నీ చెప్పాను. ఆనంద్‌రావ్ లేకుండా నేను బతకలేను. ఆ విషయం ఆయనకీ స్పష్టంచేసాను. ఆయన నన్ను అర్థంచేసుకున్నారు.

అసలే మాది పల్లెటూరు. ఊరంతా గుసగుసలు మొదలయ్యాయి. ఆనందరావుని కల్సుకోకుండా అమ్మా, నాన్న కట్టడిపెడుతున్నారు. ఆయన్ని కల్సుకుని అన్నీ మాట్లాడాను. ఆయన నన్ను పెళ్ళి చేసుకుంటానన్నారు.

నా హృదయం ఓలలాడింది. గుండెల్లో వెన్నెల విరగబూసింది. ఆయనకు భార్య కావడం నా అదృష్టం—

కాని.... కాని.... మా కులాలు వేరు.

నాన్న మా కులం కుర్రాడికైతే తప్ప చెయ్యనని ఖచ్చితంగా చెప్పాడు. నాకు పెద్ద చదువు లేదు. ఉద్యోగం లేదు. కట్నం ఇవ్వడానికి నాన్న దగ్గర డబ్బు లేదు. అయినా ఆయనకింకా కులాల పట్టింపులు, ఛాందసపు ఆలోచనలు ఎందుకు చెప్పండి.

'ఎవ్వరికీ భయపడక్కర్లేదు. రిజిష్టర్ మేరేజ్ చేసుకుందా' మంటున్నారు ఆనందరావు

నాన్న నా పెళ్ళి చెయ్యలేడు. దానిక్కావల్సిన డబ్బు ఆయన దగ్గర లేదు. ఒకవేళ తల తాకట్టుపెట్టి చేసినా నేను ఆనందరావుని మర్చిపోలేను.... అతను లేకుండా నేను జీవించలేను. ఏ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలోనో అర్చకత్వం చేసుకునే ఏ అనంతాచార్యుల్నో, వెంగళాచార్యుల్నో కట్టుకుని అతని పూజకు గన్నేరుపూలు కోసి ఇస్తూ సుద్దగంగ సింధూరం అందిస్తూ, కొబ్బరిముక్కలు తిరుగుతూ అతని దీపారాధనకి వత్తులు చేసిస్తూ నేను బతకలేను.

ఆనందరావుని చేసుకోడం సాధ్యం కాకపోతే చచ్చిపోడం సాధ్యమౌతుందేమో చూస్తాను. ఇలాంటి పల్లెటూళ్లో వర్ణాంతర వివాహం చేసుకుంటే ఎదురయ్యే పరిస్థితులు మీకు వేరే వివరించనక్కర్లే దనుకుంటాను. ఈ విషయంలో మీ సలహా కావాలి. నా మీద నాకు కాన్ఫిడెన్స్ కావాలి. అది మీరే ఇవ్వగలరు— నాకు ధైర్యం చెప్పండి. సలహా పూర్వకంగా జాబు రాయండి.

—దమయంతి"

ఉత్తరం రెండుసార్లు చదివాను.

చిన్నదిగా కనిపిస్తున్నా సమస్య పెద్దది.

ఇది కథ కాదు— నా యిష్టం వచ్చినట్టు మలచడానికి— జీవితం.

అనాలోచితంగా ఇచ్చిన ఏ సలహా అయినా ఆమె జీవితాన్ని మంచికో చెడుకో ఏదోవైపు— తిప్పేస్తుంది.

దమయంతి ఉండేది పల్లెటూళ్లో. ఆమె పుట్టినది సనాతన ఛాందస కుటుంబంలో....

పరిష్కారం చెప్పడం చాలా సింపుల్.... ఆచరణ కష్టం.

చాలా ఆలోచించాను.

దమయంతి జీవితం ఆనందరావు చేతుల్లో సుఖంగా వుంటుందని ఆమె నమ్మగలిగితే, అతనిపై ఆమె అంచనా కరెక్టని ఆమె భావిస్తే అతన్ని చేసుకుంటేనే మంచిదని— మనుషుల్లో నిజాయితీ, పరస్పర అవగాహన లేకనే చాలా ప్రేమ వివాహాలు ఫెయిల్ కావడం, అందువల్ల మన సమాజంలో వాటి పై చిన్నచూపు చూడటం జరుగుతోందనీ, ఆమెకు ఉత్తరం రాశాను. ప్రేమ వివాహం వల్ల స్త్రీ పురుషుల మధ్య అవగాహన, ఇష్టం, ప్రేమ పెంపొందాలి కాని— విచ్చలవిడితనం అలవాటు కాకూడదని ఆమెకి మరీ నొక్కి చెప్పాను ఉత్తరంలో. అంతేగాక, పెళ్ళి చేసుకున్నాక ఆనందరావు మరో ఊరికి బదిలీ చేయించుకుని వెళ్లిపోడం మంచిదని కూడా రాశాను.

ఉత్తరం రాసి పోస్టు చేసాక సంతృప్తిగా అనిపించినా, ఆమె ఎలా నెగ్గుకొస్తుందోనన్న ఆత్రుత మాత్రం మిగిలిపోయింది.

తర్వాత రెండు నెలలు నాకు ఆమె నుండి అసలు ఉత్తరమే లేదు. ఆమె ఆనందరావుని చేసుకుందో లేదో ఆమె అసలు అక్కడ వుందో లేదో కూడా నాకు తెలియదు.

మా పిన్నిగారమ్మాయి వాణి పెళ్లికోసం, నేను మావారు పాలకొల్లు వెళ్లాం. చాలా కాలానికి అటుగా వెడుతున్నాం కాబట్టి చుట్టుపక్కల వున్న స్నేహితుల్ని, చుట్టాల్ని చూసిరావాలని పదిరోజులు శెలవు పెట్టాం.

పెళ్ళి అయిపోయాక మా పిన్నిగారి రెండో అమ్మాయి గుణవతిని తోడు తీసుకుని వెళ్ళి దమయింతిని చూసిరావాలని నిర్ణయించుకున్నాను. ఒకవేళ ఆమె అతన్ని పెళ్ళిచేసుకుని మరో వూరు వెళ్ళిపోతే ఆమె గురించిన విశేషాలైనా తెలుస్తాయనిపించింది.

ఆ వూళ్ళో దమయంతి నాన్నగారి పేరు చెప్తే వాళ్ళిల్లు తొందరగానే తెల్సింది. తీరా మేం వాళ్ళింటి కెళ్ళేసరికి తాళం వేసివుంది. ఎదురుగా ఉన్న ఇంటికెళ్ళి వాకబు చేసాం.

"వాళ్ళింట్లో అంతా గుడికెళ్ళారు. ఈ రోజు ఏకాదశి కదా! వాళ్ళేదో పూజ చేయిస్తారు. వాళ్ళు వచ్చేదాకా మా ఇంట్లో కూర్చోండి," అంది ఆ ఇంటి ఇల్లాలు.

ఆమె తనని తానే పరిచయం చేసుకుంది.

ఆమె పేరు సుగుణ....

ఆమెను నేను పరిచయం చేసుకున్నాను.

"అయితే మీరు దమయంతి కోసం వచ్చారన్నమాట. ఆమె ప్రస్తుతం ఊళ్ళో లేదు. సామర్లకోట వాళ్ళ మామయ్యగారింటి కెళ్ళింది."

నా ఉత్సాహమంతా చచ్చిపోయింది.

పోనీ దమయంతి పెళ్ళి విషయం సుగుణ నడిగితే? జరిగిందో లేదో, అసలా విషయం సుగుణకు తెలుసో లేదో అనవసరంగా దమయంతిని అల్లరి పెట్టడం అవుతుంది. ఆలోచించి అటు నరుక్కురావడానికి నిర్ణయించుకున్నాను.

"ఇక్కడ కరణంగారిల్లెక్కడ?" అడిగాను.

"ఇదే- మేం వాళ్ళింట్లోనే అద్దెకుంటున్నాం."

"ఇక్కడ ఆనందరావని...."

సుగుణ నన్ను పూర్తిచెయ్యనివ్వలేదు.

"మావారే- ఎందుకలా అడిగారు?"

నాకు నోట మాట రాలేదు.

సుగుణకి ముప్పైఏళ్ళ వయసుంటుంది. పిల్లని చూడగానే చెప్పెయ్యొచ్చు. ఓ పిల్లా కాంపోజిషన్ పుస్తకాల్లో ఎర్రపెన్సిల్‌తో ఏదో రాసేస్తున్నాడు. మరో

చంటిపిల్లాడు ఇల్లంతా పాకుతూ సుద్దముక్కల్తోటి, డస్టర్‌తోనూ ఆడుకుంటు న్నాడు.

ఆనందరావు ఇద్దరు బిడ్డల తండ్రి!

ఆమె అతన్ని ప్రేమించిందా? మరి అతను అవివాహితుడని రాసింది?

నా కేం అర్థంకావడంలేదు.

"మావారు మీ కెలా తెలుసు?" సుగుణ నవ్వుతూ అడిగింది.

అలాంటి ప్రశ్నను ఆమెనుంచి ఊహించాను,

"మీ వారికి కవిత్వమంటే బాగా ఇష్టమని దమయంతి రాసింది."

చక్కని అబద్ధం ఆడాననుకున్నాను.

"నా మొహం. ఆయన కనీసం న్యూస్‌పేపరైనా చదవరు. ఆయనకన్నా నేనే నయం- పుస్తకాలు చదవడంలో. అయినా ఆయన గురించి దమయంతి కేం తెలుసు? ఆయన కనీసం ఒక్కసారైనా ఆమెతో మాట్లాడలేదు. ఆయన కసలే ఆడవాళ్ళంటే చచ్చేంత సిగ్గు."

దొరికిపోయాను.

ఏమిటీ మిస్టరీ?

దమయంతి అబద్ధం రాసిందా?

పొంతనలేని మా సంభాషణ అర్థంకాక గుణవతి మా వంక అయోమయంగా చూస్తోంది.

"దమయంతికి పెళ్ళిప్రయత్నాలు చేస్తున్నారా వాళ్ళ నాన్నగారు?"

అసలు విషయం తెల్సిపోతుంది.

సుగుణ ఓ క్షణం మౌనంగా వుంది. కంఠం తగ్గించింది.

"ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాని బొత్తిగా బావుండదు. మనిషి సన్నగా, రివటలా, ఎముకలు కన్పించేటట్టుగా వుంటుంది. పైగా కొంచెం గూని కూడా.....చదువా అంతంత మాత్రం. ఉద్యోగం లేదు. వీళ్ళు కట్నం ఇవ్వలేరు. ఇవేమీ లేకుండా చేసుకునే మొగాడెవరు?"

సుగుణ మాటల్లో హేళన లేదు.

దమయంతి పట్ల సానుభూతి వుంది.

నా కొంచెం అర్థమయ్యింది.

"పిల్ల మాత్రం గుణవంతురాలు. తన పనేదో తను చూసుకుంటుంది."

సుగుణ జోడించింది.

దమయంతి నాకు రాసిందంతా అబద్ధం. అసలామెకు ఆనందరావుతో పరిచయంలేదు. ఒకవేళ ఉండి, అది ప్రేమదాకా వెళ్ళివుంటే సుగుణకు తెలియకుండా వుండదు. అలాంటప్పుడు సుగుణ దమయంతి గురించి మంచిగా మాట్లాడదు.

దమయంతి అనాకారని సుగుణ చెప్పింది. అలా చెప్పడంలో ఆమె మాటల్లో హేళన లేదు. జాలి వుంది. సానుభూతి వుంది.

నా థియరీ కరెక్టనిపించింది.

దమయంతి కవయిత్రి. ఊహాలల్లి కవిత్వం రాస్తుంది.

నిజజీవితంలో కూడా ఊహించుకుంటోంది. తన నెవరో ప్రేమిస్తున్నట్టు, అతనికీ కవిత్వాభిమానం వున్నట్టు ఊహించుకొంటోంది. అలా తనకు అనుకూలంగా ఊహించుకోవడంలో ఓ సంతృప్తి వుంది. ఆ సంతృప్తిలో తన పెళ్ళికానితనాన్ని, అనాకారినన్న విషయాన్నీ ఆమె మర్చిపోయింది.

గుడిదగ్గరకెళ్ళి వాళ్ళను కలుస్తానని సుగుణతో చిన్న అబద్ధం చెప్పి నేను మా గుణవతి కల్సి బస్సెక్కి పాలకొల్లు వచ్చేశాం.

* * *

హైద్రాబాద్ తిరిగొచ్చిన పది రోజులకు నాకు దమయంతి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"పచ్చి నిజాన్ని మింగలేక
అబద్ధపు గాలిమేడల్లో జీవిస్తున్నాను.
నన్ను క్షమించు ప్రియతమ్....
గుర్తుంచుకో నేస్తం- నన్ను గుర్తుంచుకో
గులాబీలా కాదు- దాని ముల్లులాగ కాదు.
గులాబీ మొక్క నుంచున్న చోట పోగైన
కోటానుకోట్ల ఇసుక రేణువుల్లో ఒకటిగా-" దమయంతి.

ఆ ఉత్తరం చదివాక నాకు దమయంతిమీద కోపంరాలేదు. జాలేసింది. ఆమె భవిష్యత్తును తల్చుకుంటే భయమేసింది.